



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

అన్నమయ్య

పేజీలు 8

శనివారం | 6 సెప్టెంబర్ 2025




# అవినీతిపై చర్చకు సిద్ధమా?

- వాళ్లు దోచుకుంటారు,, ఈయన మద్దతిస్తారు,,
- సేవ చెయ్యడం అంటే స్వాహా చేయడమా ఇరగం రెడ్డి,,
- నీలాగే నువ్వు మద్దతు ఇచ్చే వాళ్ళు కూడా,,
- తప్పు చేస్తేనే చెక్ పవర్ పోతుంది,,,
- వైసీపీ హయాంలో దోచుకున్నట్లు కూటమి ప్రభుత్వంలో కుదరదు
- దమ్ముంటే ఆది తప్పు అని నిరూపించి మాట్లాడు
- వైసీపీ నాయకుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి టీడీపీ నాయకుల ఓపెన్ చాలెంజ్

ఒంటిమిట్ట,మేజర్ న్యూస్:

ప్రజలకు సేవ చేయమని పదవులు ఇస్తే దోచుకుని అడ్డంగా దొరికిపోయిన వారికి ఒంటిమిట్ట మండలంలోని అతిపెద్ద అవినీతిపరుడుగా పేరు ఉన్న వ్యక్తి మద్దతు పలకడం, టిడిపిపై, ప్రభుత్వంపై విమర్శలు చేయడం చూస్తుంటే వారు దోచుకుంటారు ఈయన మద్దతు ఇస్తారు అని ఎలా ఉందనీ ఒంటిమిట్ట టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హరిత హెూటల్ నందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, అడ్డగోలుగా ప్రభుత్వ నిధులను స్వాహా చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే వైయస్సార్సీపి నాయకుడు సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆయన అవినీతికి ఎంత అలవాటు పడ్డారో అర్థమవుతుందని, అబద్ధపు ప్రచారానికి ప్రజలు కూడా నవ్వుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌మీట్‌లో సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఒంటిమిట్ట మండలంలో 12 మంది సర్పంచుల చెక్ పవర్ రద్దు చేశారని, దీనిపై టిడిపి నాయకులు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారనీ. ఈ వ్యాఖ్యలపై మండల టిడిపి నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, ఇలాంటి అబద్ధపు మాటలు ప్రజలు ఇక భరించరని , తప్పు చేసిన వారి శిక్ష అనుభవించక తప్పదని, తప్పు చేశారు కాబట్టి చెక్ పవర్ రద్దు చేశారని తెలిపారు. అసలు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే వాటిపై కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని, అయితే కోర్టులకు బాగా అలవాటు పడిన వైసిపి నాయకులు స్పష్టంగా నిధులు స్వాహా చేశారని అర్థమవుతున్న తప్పు ఒప్పుకునే పరిస్థితి వైసీపీ నాయకులకు లేదని, ముఖ్యంగా ఇరగమ్ రెడ్డికి అసలే లేదని వారు ఎద్దేవా చేశారు.

### "రామాలయంలో ప్రమాణం చేస్తావా?"- టిడిపి సవాల్

ఆ సర్పంచులు తప్పు చేయలేదని కోదండ రాముని సాక్షిగా ప్రమాణం చేస్తావా అనిటిడిపి నాయకులు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని నేరుగా సవాలు చేశారు. "అయ్యా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి" నీ గురించి మండలంలో తెలియని వారు లేరు. నువ్వు ప్రతిరోజూ ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామిని 'మా రాముడు మోస్ట్ పవర్ఫుల్' అని సంబోధిస్తూ ఉంటావు. అయితే, సర్పంచుల రద్దులో టిడిపి ప్రమేయం ఉందని చెబుతున్నావు కాబట్టి, ఆ రామాలయ సమక్షంలో ప్రమాణం చేయగలవా అని ప్రశ్నించారు. ప్రతినిత్యం వెళ్లే రామాలయ ప్రాంగణంలో ప్రజల ముందే నీ మాటలు నిజమని ధైర్యంగా ప్రమాణం చేయి" అని టిడిపి నాయకులు ఘాటుగా ప్రశ్నించారు.

### టిటిడి స్థలాల కబ్జా - అబ్బిరెడ్డి అంశం బహిర్గతం

టిడిపి నాయకులు మరో సవాల్ విసిరారు. మిగతా 2లో






# విద్యా వ్యవస్థలో సమున్నత మార్పులు తీసుకొచ్చాం

- విద్యార్థుల్లో ఉన్నతమైన విలువలు తీసుకురండి
- మెగా డీఎస్సీ ని పారదర్శకంగా నిర్వహించాం
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంత్రి మండిపల్లి
- 56 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానం
- పండుగ వాతావరణంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్: ఉపాధ్యాయులు సమున్నత లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రవాణా, క్రీడలు మరియు యువజన శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ రెసిడెన్సీ హాలులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ప్యాల అగ్రి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర నాయుడు, అటవీ శాఖ డైరెక్టర్ రెడ్డయ్య ప్రధాన అతిధులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడలు మరియు యువజన శాఖామంత్రి మిగతా 3లో

# అట్టహాసంగా సితార షాపింగ్ మాల్ ప్రారంభం

- సందడి చేసిన సినీతార అనసూయ భరద్వాజ్
- హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పురప్రముఖులు
- ప్రారంభ ఆఫర్లతో కిటకటలాడిన షాపింగ్ మాల్





మదనపల్లె,మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణంలో సితార షాపింగ్ మాల్ అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం పట్టణంలోని కదిరి రోడ్డు,శ్రీకృష్ణ కళ్యాణ మండపం ఎదురుగా,జడ్జి బంగ్లా పక్కనగల సితార షాపింగ్ మాల్ ప్రముఖ యాంకర్,సినీనటి అనసూయ మిగతా 2లో

# అవినీతిపై చర్చకు సిద్ధమా?



**(మొదటి పేజీ తరువాయి)**“టిటిడి వారు స్థలాన్ని శుభ్రం చేస్తే, ఆ స్థలంపై అక్రమ కట్టడాలు కట్టింది ఎవరు? టీటీడీ ఆస్తులపై కబ్జా చేసినవారు ఎవరు? మామిడి అబ్బిరెడ్డి మరియు ఇతర వైసీపీ వర్గాలే ఈ అక్రమాలకు పాల్పడ్డారని ప్రజలకు తెలుసు. అలాంటి విషయాల్లో మీ పార్టీకి సంబంధం లేదని కూటమి నాయకులపై ఆరోపణలు చేయడం నీ అలవాటు.ఇదే పద్ధతి కొనసాగితే జరిగే పరిణామాలు వేరుగా ఉంటాయి” అని మండిపడ్డారు.

## “రెండు పార్టీలు కలిసి అక్రమాలను తొలగిద్దాం”

ఒంటిమిట్ట టిడిపినాయకులు మరింత దూకుడుగా స్పందిస్తూ, సుబ్బారెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. “మా పార్టీ ఎప్పుడైనా అవినీతి లేదా అక్రమాలకు పాల్పడిందని నీకు నమ్మకం ఉంటే, ఒకసారి కలిసి కూర్చుదాం. మీ వైసీపీ తరఫున నలుగురు నాయకులు రండి, మా టిడిపి తరఫున మేము వస్తాం. ఎవరు ఎక్కడ భూకబ్జాలు చేశారో, ఎవరు అక్రమ కట్టడాలు కట్టారో స్వచ్ఛందంగా పరిశీలించి, ఇద్దరు కలిసి వాటిని తొలగిద్దాం. ఎవరైనా మా పార్టీ వ్యక్తులు కూడా అక్రమాలకు పాల్పడి ఉంటే, వారిని కూడా వెనుకాడకుండా తొలగిస్తాం. మీరు కూడా అదే ధైర్యం చూపగలరా? ప్రజల ముందే ఈ సవాల్ అంగీకరించండి” అని టిడిపి నాయకులు స్పష్టంగా ప్రకటించారు.

## అవాకులు-చవాకులు ఆపండి, నిజం మాట్లాడండి

“ప్రజల దృష్టిని మళ్లించేందుకు అబద్ధపు ప్రచారం చేయడం మీకు అలవాటైపోయింది. కానీ ఇప్పుడు ప్రజలు మోసపోవడం లేదు. ఒంటిమిట్టలో జరుగుతున్న అవినీతి, భూకబ్జాలు, అక్రమ కట్టడాలు అన్నీ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతున్నాయో అందరికీ తెలుసు. ఆ నిజం బయటకు వచ్చే భయం మీలో ఉండటంతో ప్రతిపక్షాలపై మట్టి చల్లే ప్రయత్నం చేస్తున్నారు” అని మండల టిడిపి నాయకులు ధ్వజమెత్తారు.

## టిడిపి తుది హెచ్చరిక

“ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు ఇక సహించము. ఒకవేళ ఈ విధంగానే అబద్ధపు ఆరోపణలు కొనసాగిస్తే, ప్రజల సమక్షంలో మీ అక్రమాలను ఒక్కొక్కటిగా బహిర్గతం చేస్తాము. భవిష్యత్తులో మీ వ్యాఖ్యలే మీకు అడ్డుకట్ట వేస్తాయి. మేము ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి ఉన్నాము” అని మండల టిడిపి నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జెడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు నరసింహారెడ్డి , ఎస్ వి రమణ, రోశయ్య, రాజారెడ్డి, ఎంపిటిసి భాష, పత్తి సుబ్బరాయుడు, నల్గొండ సుబ్బారెడ్డిగజ్జల శ్రీనివాసరెడ్డి, కే హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# అట్టహాసంగా సితార షాపింగ్ మాల్ ప్రారంభం

**(మొదటి పేజీ తరువాయి)** చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించబడింది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా,టిడిపి సీనియర్ నాయకులు బాబు,తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి,టిడిపి సీనియర్ నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి,నాదెళ్ల విద్యాసాగర్,మునిసిపల్ చైర్ పర్సన్ వరపన మనూజా రెడ్డి,నవీన్ చౌదరి,ఏబీసీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి,శ్రీ గుడ్ విల్ కంప్యూటర్ అధినేత అజయ్ కుమార్,వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున,డవ్ నాగరాజ,సాయిశేఖర్ రెడ్డి,రామిశెట్టి రెడ్డి కేశవ తదితరులు హాజరయ్యారు.ముందుగా అతిథులకు మాల్ యజమానులు దేవిక శివాచారి,నాగ మల్లికార్జున,ఆనంద్ కుమార్,సాయి కిరణ్ అపూర్వ స్వాగతం పలికారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనసూయ హాజరు కావడంతో ఆమెను చూడడానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.అనసూయ మాట్లాడుతుండగా కేరింతలతో హోరిత్తించారు. అనంతరం యజమానులతో కలిసి సితార షాపింగ్ మాల్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనసూయ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన షాపింగ్ మాల్స్ లో సితార షాపింగ్ మాల్ ఒకటి అన్నారు.ప్రశాంతతకు మారుపేరైన మదనపల్లి పట్టణంలో ఇటువంటి షాపింగ్ మాల్ ప్రారంభం కావడం శుభపరిణామమన్నారు.ఇక్కడ ప్రజలు తనపై చూపిన అభిమానం ఎన్నటికీ మర్చిపోలేనన్నారు.అనంతరం దుకాణ యజమానులు మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మదనపల్లి పట్టణంలో సితార షాపింగ్ మాల్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఇందులో చిన్న పిల్లలు,పురుషులు,మహిళలు పలు రకాల డిజైన్లలో దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.దుకాణం ప్రారంభం సందర్భంగా అనేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.అతి తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలు అందించడం మా దుకాణం యొక్క ప్రత్యేకత అన్నారు.కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు.అదేవిధంగా సితార షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేసిన అతిథులకు మరియు పట్టణ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## అమీనా బి సర్కిల్ వద్ద ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు

**- హాజరైన గో సంరక్షక్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వేంపల్లి అష్రఫ్**

**- ప్రజలకి పెద్దఎత్తున అన్నదానం**

**కురబలకోట,మేజర్ న్యూస్ :** అఖిల భారత గో సంరక్షక్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వేంపల్లి అష్రఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.కురబలకోట బైపాస్ రోడ్డులోని అమీనా బి సర్కిల్ ఇండియన్ హోటల్ వద్ద జరిగిన ఈ వేడుకల్లో అష్రఫ్ ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ఎంతో గొప్పవ్యక్తి అన్నారు.మహమ్మద్ ప్రవక్త ఈ లోకాన్ని విడిచి 1500 సంవత్సరాలు అయిందన్నారు.ముస్లింలకు ఆయన ఆరాధ్య దైవమని కొనియాడారు.ఆయన బోధనలు మానవాళి మనుగడకు సోపానాలన్నారు.ఈ కార్యక్రమంలో కురబలకోట యువత పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

**ములకలచెరువు, మేజర్ న్యూస్:** ములకలచెరువు మండలంలోని వేపూరికోట పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం దేవలచెరువు పంచాయతీ రాజుగారిపల్లికి చెందిన రైతు శివారెడ్డి ద్విచక్ర వాహనంలో పెట్రోల్ కొరకు రోడ్డు దాటుతుండగా మదనపల్లి వైపు నుండి బొలెరో వాహనం వచ్చి ఢీకొనడంతో రైతు శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికులు సమాచారం మేరకు108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# రైల్వే కోడూరు అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన ముక్కా



**రైల్వేకోడూరు మేజర్‌న్యూస్ :** రైల్వే కోడూరు అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం నారా చంద్రబాబు నాయుడుకి వినతి పత్రం అందజేసిన ఇంచార్జ్ కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ముక్కా రూపానంద రెడ్డివిజయవాడ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి .ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైల్వే కోడూరులో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో సవివరంగా చర్చించారు. గత రెండు దశాబ్దాలుగా సరైన మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో కూడా కూటమి ప్రభుత్వం రహదారులు, త్రాగునీరు, విద్యుత్ వంటి అవసరమైన సదుపాయాలను అందజేయడంలో విజయవంతమైందని రూపానంద రెడ్డి వివరించారు.అలాగే రైల్వే కోడూరులో ఇంకా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఒక వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి కి అందజేశారు. ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని అభ్యర్థించారు.ఈ భేటీలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి పట్ల సీఎం చంద్రబాబు కట్టుబాటు, ముఖ్యంగా పల్లెల అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం సీఎం చేపడుతున్న కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిజేశారు.ఈకార్యక్రమంలోపోలూరుకృష్ణం నాయుడు, ,నేలపాటి రామచంద్రయ్య నాయుడు ,పాటూరి శ్రీనివాసులు రెడ్డి , ముద్ద సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.



# సీతారామ దూత సేవా ట్రస్ట్ కార్యక్రమాలు అభినందనీయం



తెలుగుదేశం నాయకులు నాగూర్ వలి ప్రశంసలు

**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** సీతారామ దూత సేవా ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మదనపల్లి ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగూర్ వలి (షో ఆప్ శీనా) పేర్కొన్నారు.వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని 14వ వార్డులో ట్రస్ట్ సభ్యులు వినోద్,కళ్యాణ్, ధరణీష్,దిలీప్,శివల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా నాగూర్ వలి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ దూత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ప్రశంసనీయమన్నారు.ప్రతి ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు ఏదో ఒక సేవా కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ అన్నారు.ఈ ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారన్నారు.రక్తదానం ప్రాణ దానంతో సమానమని,రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని,సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో సీతారామ దూత సేవా ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం కావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని,మొత్తం 35 మంది రక్తదానం చేయడం శుభపరిణామమన్నారు.సమాజ సేవ కార్యక్రమాలలో తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు స్పష్టం చేశారు.

# మిట్స్ యూనివర్సిటీలో సాంప్రదాయబద్ధంగా ఓనం పండుగ



– ముఖ్యఅతిథిగా హాజరైన ప్రో–ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్

**కురబలకోట,మేజర్‌న్యూస్ :** మదనపల్లె సమీపంలోని మిట్స్ (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు శుక్రవారం ఓనం పండుగను విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ప్రో–ఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతీ,సంప్రదాయాలకు ప్రతీకలన్నారు.ఒక్కో రాష్ట్రంలో జరుపుకునే పండుగలు ఆయా రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు.ఏపీలో సంక్రాంతి, తెలంగాణలో బతుకమ్మ, బోనాలు,తమిళనాట దీపావళి ఎంత ప్రసిద్ధి చెందాయో,కేరళ రాష్ట్ర పండుగ ఓనం కూడా ఆ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక అని అన్నారు.ఈ ఓనం పండుగ సమానత్వం, ఐకమత్యం,సంతోషాన్నిప్రతిబింబిస్తుందని విద్యార్థులు ఇలాంటి వేడుకల ద్వారా భారతీయ సంప్రదాయాల వైభవాన్ని తెలుసుకోవాలని సూచిం చారు. భారతదేశంసంస్కృతి,సంప్రదాయాలకు పుట్టినిల్లుగా వర్ణిస్తూ యూనివర్సిటీలోని విద్యార్థులు కేరళ సంప్రదాయాలకు అనుగుణంగా పూలతో అలంకరించిన పువ్వుల ముగ్గు,సాం ప్రదాయ నృత్యాలు,పాటలు, ఆటలతో వేడుకలను ఉత్సాహభరి తంగా నిర్వహించారు.కార్యక్రమంలోఆర్ట్స్అండ్‌కల్చరల్ కోఆర్డి నేటర్ వైప్రదీప్ కుమార్, సాక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత,ఫ్యాకల్టీసభ్యులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలోపాల్గొనికార్యక్రమాన్నివిజయవంతం చేశారు.



# విద్యపరిశోధనలో విశిష్ట సేవలకు మిట్స్ అధ్యాపకురాలికి అరుదైన పురస్కారం

– డాక్టర్ షాహీన్‌కి జాతీయ ప్రతిభా అవార్డు ప్రదానం

**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :**
అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్ కళాశాల)లో ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసరుగా పనిచేస్తున్న డాక్టర్ కె.షాహీన్ ప్రతిష్టాత్మకమైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డు–2025 అందు కున్నారు.ఈ అవార్డు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సదర్న్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా చలపతి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు.ఈ అవార్డును గుంటూరు–కృష్ణ జిల్లాల మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా డాక్టర్ షాహీన్ అందుకున్నారు.బోధనలో కొత్త పద్ధతులను అవలంబించడం,విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడం, పరిశోధన రంగంలో చూపిన కృషి ప్రదానం చేశారు.ఈ పురస్కారాన్ని అందుకోవడం ద్వారా అధ్యాపకులు,విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.ఇలాంటి గురువులు సమాజానికి అవసరమని అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ షాహిన్ మాట్లాడుతూ జాతీయ



ప్రతిభ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు పాఠ్యాంశాలను మరింత సులభమైన పద్ధతిలో బోధించడం, పరిశోధనల వైపు నడిపించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు



**బి.కొత్తకోట,మేజర్ న్యూస్:** మహమ్మద్ ప్రవక్త జన్మదినం వేళ మీలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం బి.కొత్తకోట పట్టణంలో ముస్లిం సోదరులు ఘనంగా వేడుకలు నిర్వహించు కున్నారు. స్థానిక చౌక్ మస్జిద్ నుండి దిగువ బస్టాండ్,బైపాస్ రోడ్డు రంగసముద్రం రోడ్డు మీదుగా బెంగళూరు రోడ్డు జామియా మసీదు వరకు పుర వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు.జ్యోతి చౌక్ నందు మతపెద్దలతో కలిసి మానవహారం నిర్వహించారు.అనంతరం ఇమాం షావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి మహమ్మద్ ప్రవక్తను స్మరించుకొన్నారు.మీలాద్ ఉన్ నబీ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టి అన్నదానం నిర్వహించారు.ఎటువంటి ఇబ్బంది లేకుండా బి.కొత్తకోట సి.ఐ గోపాల్ రెడ్డి,పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# నాణ్యమైన సేవలు అందించాలి

పట్టణంలో ఎండి మొబైల్స్ షాప్ ప్రారంభంలో శ్రీకాంత్ రెడ్డి



**రాయచోటి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** నాణ్యమైన సేవలు అందించి వినియోగ దారుల మన్ననలను పొందాలని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు.రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్ లో కల్పన ఫ్యాన్సీ స్టోర్ ప్రక్కన శుక్రవారం నాడు ప్రొఫరైటర్ ఫర్హాన్ చే నూతనంగా ఏర్పాటు చేసిన ఎండి మొబైల్స్ షాప్ ప్రారంభంలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ల వినియోగం ఎంతో పెరిగిందని, ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు మరియు సేవలు అందించడమే వ్యాపార విజయానికి కీలకమన్నారు. ఎండి మొబైల్స్' కూడా అదే దిశగా వినియోగ దారుల విశ్వాసాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి పట్టణ అధ్యక్షుడు నవాజ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్, టెలికాం కమిటీ సభ్యుడు అబుజర్ పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మీ 5వ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

**ఓబులవారిపల్లె మేజర్‌న్యూస్ :** శ్రీ మహాలక్ష్మీ దేవాలయ 5వ వార్షికోత్సవం వేడుకలును ,పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఓబులవారిపల్లె మండలం శేషక్కగారిపల్లెలో వైభవంగా నిర్వహించిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవంలో గ్రామస్థులతో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు.స్థానిక మండలంలో శేషక్కగారిపల్లె గ్రామ ప్రజలు ఆహ్వానం మేరకు శ్రీ శ్రీ శ్రీ మహాలక్ష్మీ దేవాలయ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని భక్తిపూర్వకంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలుప్రభుత్వ విప్ ,శాసనసభ్యులు అరవ శ్రీధర్ నిర్వహించారు కార్యక్రమంలో కూటమి నేతలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వెలుగు పాఠశాలలో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

– హాజరైన మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా,టి.ఎన్ హర్షవర్ధన్ రెడ్డి – ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**మదనపల్లె టౌన్,మేజర్‌న్యూస్ :** అమ్మచెరువు మిట్ట నందు గల తెలుగు ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తంబళ్లపల్లికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త టి.ఎన్ రఘు నాథ రెడ్డి కుమారుడు డాక్టర్ టి.ఎన్ హర్షవర్ధన్ రెడ్డి,మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా హాజరయ్యారు.అతిథులకు ముందుగా వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి,కన్వీనర్ భాగ్యలక్ష్మి సాదరంగా ఆహ్వానించారు.ఇందులో భాగంగా టి.ఎన్.హర్షవర్ధన్ రెడ్డి దివ్యాంగులను ప్రేమతో పలకరించి,ప్రత్యేక పాఠశాల తరగతి గదులను పరిశీలించి వారి ప్రత్యేక విద్యని,బోధన విధానాన్ని గురించి తెలుసుకుని పిల్లల యొక్క వసతి గదులను కూడా పరిశీలించారు.వెలుగు వృద్ధాశ్రమాన్ని పరిశీలిస్తూ వృద్ధులను ఆప్యా యంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసు కున్నారు.డాక్టర్ టి.ఎన్ హర్షవర్ధన్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా స్వర్గీయ టి.ఎన్. రఘునాథ రెడ్డి,సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ముందుగా వెలుగు ప్రిన్సిపాల్ పి.లీనాకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికి ఉపాధ్యాయుల దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.వెలుగు సంస్థ ప్రారంభం నుండి టి.ఎన్.రఘునాథ రెడ్డి కుటుంబం చేస్తున్న సహాయ,సహాకారాలు ఎనలేనివని కొని యాడారు.ఎంతమంది దివ్యాంగులకు,వృద్ధులకు సేవ చేస్తున్నామంటే వీరి సహాయం ఎంతో వర్ణిం చలేనిదన్నారు.తరువాత చదువు యొక్క గొప్ప తనంనేటి సమాజానికి తెలియజేయడానికి దివ్యాం గులు చిన్న నాటిక మరియు నృత్య ప్రదర్శన చేశారు.వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వెలుగు వ్యవస్థాపకురాలు పద్మజ, టి.ఎన్. రఘునాథ రెడ్డి సహాకారంతో వెలుగు సంస్థ స్థాపించి,ఇంత మంది దివ్యాంగులలో వెలుగులు నింపారని,మనలోని అజ్ఞానాన్ని తొలగించి,జ్ఞానాన్ని అందించేవారేగురువులనితెలిపారు.వెలుగు సెక్ర టరీయం.ఉదయ్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇంత మంచి మనస్సు కలిగిన డాక్టర్ టి.ఎన్ హర్షవర్ధన్ రెడ్డి ఉపాధ్యాయుల దినోత్సవానికి విచ్చేసి సంస్థలోని దివ్యాంగులకు విద్యను అం దిస్తున్న ఉపాధ్యాయులందరిని శాలువాలతో సత్కరించి, మొమెంటోలను బహు మతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ట్రెజరర్ ఎన్.రఘునాథ రెడ్డి,ప్రిన్సిపాల్ లీనా కుమారి,సోషల్ వర్కర్ ఎం.గీత,వెలుగు సిబ్బంది,చిన్నారులు పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు

గురువులకు విద్యార్థుల ఘన సన్మానం



**సంబేపల్లి మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఉపాధ్యాయ దినోత్సవ వేడుకను విద్యార్థులు ఘనంగా నిర్వహిం చారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుక్రవారం విద్యార్థులు తమ గురువులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంపొందింప చేసే విధంగా విద్యార్థులు సన్మానము, బహుమతుల ద్వారా కృతజ్ఞతలు తెలపడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఉపాధ్యాయులకే ఆటల పోటీలు నిర్వహించి బహు మతులు ప్రధానము చేయడం గొప్ప విశేషం అన్నారు . ఇలాంటి కార్యక్ర మాలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయ విద్యార్థుల మధ్య సంబంధం వృద్ధి చెంది, అభ్యాసం పెంపొందుతుందని అన్నారు. ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల మధ్య బంధం బలోపేతంగా ఉన్నప్పుడు విద్యార్థుల జ్ఞానము, నైపుణ్యాలు, వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవ జీవితానికి సోపానాలు

– జగన్ కాలనీ వద్ద భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవ జీవితానికి సోపానాలని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు.శు క్రవారం మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని జగన్ కాలనీ వద్ద గల గోషాపాక్ జెండా వద్ద ముస్లిం మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం మహమ్మద్ ప్రవక్త బోధనలు ఎంతో దోహద పడ్డాయన్నారు.ఆయన చూపిన మార్గంలో మాన వాళి నడవాలన్నారు.ప్రతి ఏడాది జగన్ కాలనీ వద్దమిలాద్ఉన్‌నబీవేడుకలుఘనంగా జరుపు కోవడం ఆనవాయితీ,అదే రీతిలో ఈ ఏడాది సైతం ఈ పర్వదినాన్ని జరుపుకోవడం గొప్పగా జరిగి ందన్నారు.హిందూ,ముస్లింలు ఐకమత్యంగా ఈ పండుగను జరుపుకొని మత సామరస్యాన్ని చాటు కోవడం విశేషం.మహమ్మద్ ప్రవక్త ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రజలకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న జాజాల సుశీల



**సిద్ధవటం మేజర్ న్యూస్:** ఒంటిమిట్ట మండల స్థాయి ఉత్తమ టీచర్ అవార్డు అందుకున్న నరసన్న గారి పల్లిలో ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్న ఎస్జిటి టీచర్ జాజాల సుశీలకు శుక్రవారం ఉదయం ఎంఈఓ బ్రహ్మయ్య చేతులు మీదుగా అవార్డు అందుకోవడం జరిగిందని వారు తెలిపారు జాజాల సుశీల మాట్లాడుతూ వృత్తి ధర్మంలో విద్యార్థినీ విద్యార్థుల పట్ల అంకిత భావంతో పనిచేస్తున్న కాబట్టి నన్ను ఒంటిమిట్ట మండల స్థాయి ఉత్తమ టీచర్ అవార్డుకి ఎంపిక చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఆమె తెలిపారు

# యువత తాము ఎంచుకున్న రంగాల్లో అద్భుతంగా రాణించాలి

– కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి కితాబు



**మదనపల్లె రూరల్,మేజర్‌న్యూస్ :** యువత తమ అభిరుచి మేరకు ఒక రంగాన్ని ఎంచుకుని అందులో అద్భుత ప్రగతి సాధించాలని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి కితాబునిచ్చారు.శు క్రవారం వలసపల్లి కనుమలో గంగమ్మ గుడి వద్ద జిలాని నూతనంగా ఏర్పాటు చేసిన కేకే మియా బిర్యాని సెంటర్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అదేవిధంగా ఈ కార్యక్రమానికి వలసపల్లి సర్పంచ్ గువ్వల నాగరాజ రెడ్డి విచ్చేశారు.ముందుగా జిలానికి వారు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చునన్నారు.ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లభించినప్పుడు చెడు వ్యసనాలకు లోనుకాకుండా వ్యాపారరంగంపై దృష్టిసారించాలన్నారు.వారికిఏ రంగంలో అభిరుచి ఉంటే ఆ రంగాన్ని ఎంచుకొని క్రమ శిక్షణ, పట్టుదలతో పనిచేసే అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు.భోజనం ప్రియులకు పసందైన వంటకాల రుచిని చూపించి కేకే మియా బిర్యాని సెంటర్ అందరి ప్రశంసలు అందు కోవాలని ఆకాంక్షించారు.అనంతరం నాగరాజ రెడ్డి మాట్లా డుతూ నిరంతరం రద్దీగా ఉండే గంగమ్మ గుడి ప్రాంతంలో కేకే మియా బిర్యాని సెంటర్ ఏర్పాటు చేసిన జిలానికి అభినందనలు తెలిపారు. నాణ్యమైన,రుచికరమైన శాఖాహార ,మాంసాహార వంటకాలనుప్రజలకుఅందిస్తే వ్యాపారానికి తిరుగు ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తవారిపల్లి సర్పంచ్‌మహేష్ బాబు,తట్టి నాగరాజు రెడ్డి,బివైఎస్ వ్యవస్థాపకులు పునీత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

– ఉద్యోగాలకు ఎంపికైన 18 మంది విద్యార్థులు

**మదనపల్లె రూరల్,మేజర్‌న్యూస్ :** పట్టణం సమీపం,పుంగనూరు రోడ్డు నందు గల ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టాప్ అకాడమీ సంస్థచే ప్రాంగణ నియామకాలు జరిగాయి.ఈ సందర్భంగా వివిధ విభాగాల నుంచి 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని,వీరికి 3.5 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని టాప్ అకాడమీ సంస్థ హెచ్.ఆర్ మేనేజర్ ధీరజ్ ధ్రువీకరించారు.ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనితల్లిదండ్రులకుకళాశాలకు గుర్తింపు తీసుకురావాలని వివ రించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు విద్యా ర్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్, సి.మనోజ్ కుమార్ వివిధ విభాగాధిపతులు,అధ్యాపకులు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.




# హత్యాయత్నం కేసులో ఆరుమంది నిందితుల అరెస్ట్

– వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి మహేంద్ర



**మదనపల్లె టౌన్,మేజర్‌న్యూస్ :** హత్యాయత్నం కేసులో 6 మంది నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు.స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషనులో శుక్రవారం నిందితులని అరెస్టు చూపించారు.ఈ సందర్భంగా డిఎస్పి మహేంద్ర మాట్లాడుతూ మదనపల్లె పట్టణం బికేపల్లి కాలనీకి చెందిన షేక్ సలీం బాషాకు రాయచోటికు చెందిన షేక్ జావేద్,షేక్ షామీర్ హుస్సేన్లకు ఆస్తి తగా దాలు ఉన్నాయి.ఈ క్రమంలో గత కొద్దికాలంగా ఇరు కుటుంబాల వారు పలుమార్లు ఘర్షణలకు పాల్పడ్డారు.ఈ నేపథ్యంలో ఎలాగైనా మదనపల్లి బీకే పల్లి కాలనీలో ఉన్న షేక్ సలీం బాషా చెందిన ఇంటిని స్వాధీనం చేసుకోవాలన్న ఆవేశంతో షేక్ జావేద్,షేక్ షామీర్ హుస్సేన్లు తన బంధువులైన షేక్ ఇలాహీ,వేంపల్లి మస్తాన్,షేక్ అమీర్ సాహెబ్,కొమ్మిరి శెట్టి విశ్వనాథలను వెంటబెట్టుకొని ఈనెల 3 తేదీ ఉదయం మదనపల్లె పట్టణంలోని బీకేపల్లి కాలనీకి వచ్చారు.ఇంటి ముందు గేటును ధ్వంసంచేస్తుండగా కింద పోర్షనులో అద్దెకుంటున్న బుక్యా రమేష్ నాయక్ ఎందుకలా చేస్తున్నారని అడ్డగించాడు.మొదట గేట్లు తీయాలని బలవంతం చేయగా రమేష్ నాయక్ తీయకపోవడంతో వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించారు. అంతే కాకుండా అటుగా వచ్చిన స్థానికుడు ప్రశ్నిం చడంతో అతని ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు.ఈ సమ యంలో 100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరడంతో నిందితులు పరారయ్యారు. ఈశ్వర్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను స్థానిక రామారావు కాలనీ ఆటోస్టాండ్ వద్ద అరెస్టు చేశారు.కేసుపురోగతి సాధించడంలో నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ రాజారెడ్డి ,ఎస్.ఐ రహీముల్లాను అభినందించారు.

# రక్తదానం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

– ప్రముఖ సినీతార అనసూయ భరద్వాజ్ వెల్లడి



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** మదనపల్లెలో ప్రముఖ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సినీతార అనసూయ భరద్వాజను హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ కలిశారు.తమ సంస్థ సేవా కార్యక్రమాల గురించి వివరిం చారు. ఆమె కూడా యువత సేవా కార్యక్రమంలో ముందు ఉండటం చాలా హర్షించదగ్గ విషయమని,రక్త దానానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా హెల్పింగ్ మైండ్స్ సేవలు ప్రసంశనీయమని,భవిష్యత్తులో వీరి సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కోనేటి సాంబ,ఫయాజ్,నవీన్ పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం...



**ములకలచెరువు, మేజర్‌న్యూస్ :** ములకలచెరువు మండలంలో శుక్రవారం మండల వ్యాప్తంగా పలు విద్యా సంస్థలు, విద్యా శాఖ కార్యాలయాలలో గురు పూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల ఆటవిడుపు కోసం క్రీడా పోటీలు నిర్వహించారు.గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు.పూర్వపు విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయంలో ఎన్ వెంకటరమణ, శంకరయ్య ప్రధానోపాధ్యాయులు పి. కృష్ణారెడ్డి,ఆదర్శ పాఠశాలలు ప్రిన్సిపల్ కవిత, సుబ్రహ్మణ్యం, గంగాధర్, ధనశేఖర్ రెడ్డి,శివ శంకర్,వెంకట చలపతి,భారతి, ఉష,రాధికా, కళావతి, ముషీద్, హుస్సిన్,శ్రీధర్,కిరణ్,భార్గవి,సుధా,శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు

– వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి యన్.క్రిష్ణారెడ్డి



**బి.కొత్తకోట,మేజర్‌న్యూస్:** ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని వాకర్స్‌అసోసియేషన్‌ప్రతినిధియన్.క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు.వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా యన్.క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి ఆయన వ్యక్తిత్వం ఎవరెస్ట్ శిఖరం.మీరు నా కృష్ణుడు,నేను మీ అర్జునుడు అన్నారు మహాత్మా గాంధీ.మీరు నా ఉపాధ్యాయుధు అన్నారు పండిట్ నెహ్రూ.నాలో మామూలు మనిషిని దర్శించిన మహర్షి సోవియట్ అధినేత స్టాలిన్.మీరు ఏ మహా పురుషుని గురించి ప్రభోదించారో ఆ మహా పురుషుడు మీరే అన్నారు అమెరికా అధ్యక్షుడు జాన్ కెన్నడి మేధావులకు ఉపాధ్యాయుడు అన్నారు.ప్రపంచ మేధావులు. ఉపాధ్యాయులలో మేధావి అన్నారు ఉపాధ్యాయులు.గురువులలో బ్రహ్మ అన్నారు విధ్యార్థులు.మహా పురుషుడుఅన్నది కాలం.ఆయన రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన పుట్టినరోజు వేడుకను ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయనను సన్మానించాలను కొని వెళ్లిన శిష్యులకు చేసిన సూచన మేరకు ప్రతి సంవత్సరం ఈ వేడుకలు జరుపుకొనుట ఆనవాయితీ అన్నారు.వాకర్స్ అందరూ పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జయప్రదం చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎలిశెట్టి ధనుంజయ



**ఓబులవారిపల్లె మేజర్ న్యూస్ :** ఓబులవారిపల్లె మండలంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సంద ర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపా ధ్యాయుల జాబితాలో ఓబుల వారిపల్లి పాలిటెక్నిక్ కళాశాల గణితం లెక్చరర్‌డాక్టర్ ఎలిశెట్టి ధనుంజయకు చోటు దక్కింది.కళాశాలప్రిన్సిపాల్ సహోద్యోగులు విద్యా ర్థులు ఆయన విజయాన్ని అభినందించి విద్యార్థుల పట్ల అంకితభావం గణిత విద్యలో మార్గదర్శకత్వం వల్లే ఈ ఘనత సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. ధనుంజయతన సేవను గుర్తించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ మైనారిటీ మహిళా నాయకురాలి కృషిని విస్మరిస్తుందా?

**రైల్వే కోడూరు రూరల్ మేజర్ న్యూస్ :** రాజకీయాల్లో ముస్లిం మహిళల పాత్ర చాలా అరుదుగా కనిపించే ఈ రోజుల్లో రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన మైనారిటీ యువ నాయకురాలుసయ్యద్ మెహతాజ్ బేగం తన నిబద్ధతతో అహర్నిశల కష్టంతో తెలుగుదేశం పార్టీకి ఒక బలంగా పార్టీకి సేవ చేయడమే కాకుండా పార్టీ ప్రతిపక్షంలో ఉన్న ప్రతికూల కాలంలోనూ తన వ్యక్తిగత జీవితం కుటుంబాన్ని పక్కన పెట్టి పార్టీ బలానికి అండగా నిలిచిన ఆమె కృషి ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.దుద్యాల అనిత దీప్తి రైల్వే కోడూరునియోజకవర్గంనుంచిఎమ్మెల్యే అస్పిరెంట్‌గా ఉన్న సమయంలో సయ్యద్ మెహతాజ్ బేగం ఆమెతోపాటు ప్రతి ఊరు ప్రతి వాడ ప్రతి పల్లె ప్రతి గడప తిరిగి తిరిగి ప్రచారం చేశారు.అప్పుడు ఇన్చార్జిగా ఉన్న కస్తూరి విశ్వనాధ నాయుడు ఆధ్వర్యంలో ప్రతి ర్యాలీ ప్రతి నిరసన ప్రతి దీక్షలో పాల్గొని పార్టీకి అంకితభావంతో సేవ చేశారు. తర్వాత పార్టీ రాజకీయ సమీకరణాల కారణంగా ఇన్చార్జి బాధ్యతలు ముక్కా రూపానంద రెడ్డి కి అప్పగించగా ఆయన బలపరిచిన అరవ శ్రీధర్ కి గెలుపు తేవాలని నిశ్చయించుకుని ప్రతి ఇంటి వద్దకు చేరుకుని ప్రతి వీధిలో తిరిగి ఓట్లు అభ్యర్థించిన ఆమె పట్టుదల అందరినీ ఆకట్టుకుంది. వైసీపీ ప్రభుత్వం పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి బెదిరింపులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలోనే సయ్యద్ మెహతాజ్ బేగం వెనుకడుగు



వేయలేదు. భయాన్ని అధిగమించి నిస్వార్థంగా టిడిపి కోసం పనిచేయడం ద్వారా సహచర కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రత్యేకంగా నారా చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసిన రోజుల్లో ఆమె నిరవధిక నిరాహార దీక్షల్లో ప్రతిరోజూ పాల్గొని పార్టీ బలాన్ని పెంచడంలో చురుకైన పాత్ర పోషించారు.ప్రతి పక్షంలో టిడిపి చేపట్టిన కీలక కార్యక్రమాలు ఉన్న సమయంలో నిర్వహించిన అన్ని ప్రధాన ఉద్యమాలు నిరసనలు అవగాహన కార్యక్రమాల్లోనూ సయ్యద్ మెహతాజ్ బేగం ముందంజలో ఉన్నారు. వాటిలో ముఖ్యంగా ఇదేమీ కర్మ మన రాష్ట్రానికి ఉద్యమం బాదుడే బాదుడు కార్యక్రమం స్త్రీశక్తి సమావేశాలు బాబు షూరిటీ భవిష్యత్తుకుగ్యారెంటీ యాత్రలు రైతుల సమస్యలపై నిరసనలు నిరుద్యోగ యువత కోసం ఉద్యమాలు మైనారిటీలహక్కుల పరిరక్షణ డిమా ండ్లు మహిళల భద్రతగౌరవంకోసంపోరాటాలు నిరవధిక నిరాహార దీక్షలు, ఆందోళనలు ఈ ప్రతి కార్యక్రమంలోనూ మెహతాజ్ బేగం చురుకుగా పాల్గొని మైదానంలోనూ సోషల్ మీడియా వేదిక లోనూ పార్టీ గళాన్ని ప్రజలకు చేరవేశారు. ప్రయాత్మకంగా బూత్ నెంబర్ 84 ఇన్చార్జిగా ఆపై రాజంపేట పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శిగా తరువాత రాష్ట్ర మైనారిటీ కార్యదర్శిగా ఎదిగిన ఆమె ప్రయాణం ఒక సాధారణ కార్యకర్త పట్టుదలతో రాష్ట్రస్థాయి నాయకురాలిగా ఎదగగలదని చూపిస్తుంది.తన ముస్లిం సమాజం తరపున గొంతు వినిపిస్తూ టిడిపి సిద్ధాంతాలను ఆ సమాజంలోకి తీసుకెళ్లిన ఆమె ముస్లిం ఓట్లు వైసీపీ నుండి టిడిపి వైపు మరల్చడంలో కీలక పాత్ర పోషించారు.అయితే అటువంటి అహర్నిశల కష్టానికి గుర్తింపు ఇవ్వ కుండా నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పిం చడంలో పార్టీ అధిష్ఠానంచూపుతున్నఅలసత్వంముస్లిం సమాజంలోనూ నియోజకవర్గ నాయకుల మధ్యనూ తీవ్ర అసంతృప్తిరేకెత్తిస్తోంది.కష్టపడిపార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు రాకపోతే భవిష్యత్తులో కార్యకర్తలకు పార్టీ మీద నమ్మకం తగ్గిపోతుంది అని విశ్లేషకులుచెబుతున్నారు.నియోజకవర్గ పలు వురు నాయకులు,ముస్లింసమాజంమీడియా ప్రము ఖులు ఏకకంఠంతో సయ్యద్‌మెహతాజ్ బేగం నామినేటెడ్ పదవులకుసరైనఅభ్యర్థిఅని ప్రకటిస్తున్నారు.

# ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

**రైల్వే కోడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి రాధాకృష్ణన్ వీరాస్వామి, సీతమ్మలకు 1888 సెప్టెంబర్ 5న మద్రాసులోని తిరుత్తణి తమిళ నాడులో జన్మించారు.వారికి నలు గురు సంతానం అందులో రెండవ సంతానంగా సర్వేపల్లి రాధాకృష్ణన్. వారి తండ్రి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లా సర్వేపల్లి గ్రామానికి చెందినవారు.వారు వలస రీత్యా మద్రాసుకు 64 కిలోమీటర్ల దూరంలో తిరుత్తణిలో నివాసం ఏర్పర చుకున్నారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా పనిచేశారు. విద్యావేత్తగా సమాజానికి అందించిన సేవలను గౌరవించడానికి ఆయన జన్మదినాన్ని ఉపాధ్యాయు దినోత్సవంగా జరుపుకుంటున్నాం.ఆయన 1954 లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను అందుకున్నారు. సాహిత్యంలో 16 సార్లు, శాంతికి11సార్లు నోబెల్ బహుమతికి ఎంపికైనారు.ఆయన 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో పనిచేసారు.ఆయన మొదటి ఉప రాష్ట్రపతిగా 1952 నుంచి 1962 వరకు మురల రెండవ ఉప రాష్ట్రపతిగా 1962 నుండి 1967 వరకునియమించబడ్డాడు. ఆయనకు 1954లో అత్యున్నత పురస్కారం అయిన భారతరత్న అందుకున్నారు. ఆయనప్రఖ్యాత తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, విద్యావేత్తగా సమాజానికి ఉపయోగపడి నాడిని శాస్త్ర వేత్తలు అంటున్నారు.ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయింతిని పురస్కరించుకొనిరైల్వేకోడూరులో పలువురు రాజకీయ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.



# రైల్వే కోడూరులో కలెక్టర్ ఆదేశాలు విఫలం

న్యాయం జరగాలని, సిండికేట్‌ను రూపుమాపాలని విన్నపం



**రైల్వే కోడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** రైతే రాజుని అన్న సామెత బాగానే ఉన్నా రైల్వే కోడూరులో అది లేదని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.స్థానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 15వేల ఎకరాల బొప్పాయి తోట రైతులు ఈ ఏడాది పంట వేశారు. గత ఒకటిన్నర నెల నుంచి రైతులకు గిట్టుబాటు ధర లేక ఇక్కడ ఉన్నటువంటి బయట నుంచి వచ్చినటువంటి సేట్లు దళారులు సిండికేట్ అయి 16 రూపాయలు ఉన్న ధరని గత నెలలో ఏడు రూపాయలకు తగ్గించగా రైతులు కడుపు మండి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్ జొక్యం చేసుకొని రైతులు దళారులు బయట నుంచి వచ్చిన సేట్లు చర్చించి ఆగస్టు ఒకటో తేదీన నుండి ఐదో తేదీ వరకు తొమ్మిది రూపాయలు ఆరో తేదీ నుంచి పది రూపాయలు అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దాన్నే వారం రోజులు 9 రూపాయలతో కొనుగోలు చేశారు. తిరిగి ఏడు రూపాయలు చేయగా రైతుల మల్ల తిరిగి ఆందోళన చేయగా సబ్ కలెక్టర్ వచ్చి తొమ్మిది రూపాయలతో కొనాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా వారం రోజుల కొన్నారు. తిరిగి ఆగస్టు 26వ తేదీన కలెక్టర్ చెప్పేరా దాంట్లో సగానికి సగం, ఐదు రూపాయలకు తగ్గించారు. రైతులు కనీసం గిట్టుబాటు ధర కావాలంటే కనీసం 15 రూపాయలు నిర్ణయించాలని కూర్చున్నారు. రైతు అప్పుల కూరుకుకొని పోకుండా పెట్టిన పెట్టుబడి రావాలంటే కలెక్టర్ నిర్ణయించిన పది రూపాయలని అమలు చేయించాలి. సెప్టెంబర్ రెండవ తేదీ రాజంపేట సబ్ కలెక్టర్‌కు రైతు సంఘం తీసుకెళ్లగా కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పినాఏం జరగకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు శుక్రవారం సమ్మెను నిర్వహించారు. దీంట్లో ప్రభుత్వం జోక్యం చేసుకొని. మార్క్ ఫేడ్ ద్వారా కొనుగోలు చేయాలి. దళారుల వ్యవస్థ రద్దు చేసి లైసెన్స్ విధానం అమలు చేయాలని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని ప్రార్థిస్తున్నాం.శుక్రవారం కోడూరులో రైతుల స్వచ్ఛందంగా బొప్పాయిబండ్లుపెట్టకుండాసమ్మె చేస్తున్నారు. వారి న్యాయమైన సమ్మెకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంసిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ ప్రకటించారు.అదే విధంగా కలెక్టర్ ఆదేశాలను లెక్క చెయ్యనప్పుడురైతులకుగిట్టుబాటుధర కల్పించమని కలెక్టర్ ఆదేశాలు అమలు చెయ్యడంలో విఫలమైనప్పుడు కలెక్టర్ ఎవరి కోసం ఉన్నట్లు ఇంతకు కలెక్టర్ ఉన్నట్ల లేనట్లా అని,ఒక జిల్లాకు కలెక్టర్ వున్నపటికీ కలెక్టర్ ఆదేశాలు అమలు కావడం లేదంటే ఈ పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి



# రాధాకృష్ణన్ ఆశయ సాధనకు ఉపాధ్యాయులు పునరంకితం కావాలి

– ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా పిలుపు – ఎమ్మెల్యేచే ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసన్మానం



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎన్విఆర్ కళ్యాణ మండపంల నందు మదనపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులతో గురుపూ జోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ శాలువా లతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందజేస్తూ ఉపాధ్యాయులందరికీ మదనపల్లి శాసనసభ్యులు యం.షాజహాన్ బాషా ఉపాధ్యాయ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఉపాధ్యాయుల స్థానం ఎంతో ఉన్నతమైనదని కితాబు నిచ్చారు.సమాజం అభి వృద్ధి చెందాలంటే అందులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.విద్యార్థులను భావిభారత పౌరు లుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యా యుల సేవలు ఎనలేనివని కొనియా డారు.విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ జీవితాన్ని గురువులు ధారపోస్తారని గుర్తు చేశారు.కావున గురువు లను గౌరవించు కోవాల్సిన బాధ్యత సమాజం లో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రకటించారు.మదనపల్లె నియోజ కవర్గాన్ని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడానికి ఉపా ధ్యాయుల చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. మాజీరాష్ట్రపతిడాక్టర్సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయా లసాధనకు ఉపాధ్యాయులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువతపై ప్రభావం చూపుతూ వారిని సన్మార్గంలో నడిపించేది గురువు లేనన్నారు.కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్,ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, మహ మ్మద్‌ఖాన్,తెలుగుదేశంనాయకులురాటకొండ శ్రీని వాసులునాయుడు, మడితంరమణ,నవీన్ చౌదరి నియోజకవర్గంలోనిఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లింగ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్య నేరం : సీడీపీఓ భాగ్యమ్మ

**ములకలచెరువు, మేజర్‌న్యూస్ :**
ములకలచెరువు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో మిషన్ శక్తి కార్యక్రమంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సంద ర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి కార్యక్రమాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సిడిపిఓ భాగ్యమ్మ తెలిపారు.ఈనెల 4 తేదీ నుండి 12వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. లింగ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్య నేరమని, బాలికలను తల్లిదం డ్రులు



చదివించాలనితెలిపారు. గృహ హి ంసపైమహి ళలకు అవగాహన కల్పించారు. మహి ళలు ఆరోగ్యం పట్లజాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభు త్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా ఇచ్చే పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని, బాల్య వివాహాలుచట్టరీత్యానేరమని వాటి వల్ల జరిగే అనర్థాలునష్టాలుగురించి తెలియజేశారు. తల్లిదం డ్రులు లింగ వ్యవస్థ చెప్పకుండా పిల్లలను పెంచా లనితెలిపారు.ఈఅవగాహన కార్యక్ర మంలో ఐసి డిఎస్ సూపర్వైజర్‌ప్రభావతమ్మ,రాధమ్మ అంగ న్వా డి కార్యకర్తలు,ఏఎన్ఎంలు,మహిళలు పాల్గొన్నారు.

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేటితరం అధ్యాపకులకు స్ఫూర్తి

– మిట్స్ యూనివర్సిటీలో వైభవంగా టీచర్స్ డే

**కురబలకోట,మేజర్‌న్యూస్ :** మదనపల్లె సమీ పంలోని మిట్స్ (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు టీచర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్ కుమార్,ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథమ్ అతిథులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సంద ర్భంగా డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మన సమాజంలో అమ్మానాన్నల తర్వాత స్థానం గురువులకు ఇచ్చారని,మనకు జన్మనిచ్చి,లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువైతే.మనకు నడక నేర్పే నాన్న రెండో గురువు.ఆ తర్వాత ఈ లోకంలో ఎలా నడుచుకోవాలో నేర్పి,విద్యా బుద్ధులు అందించే ఉపాధ్యాయుడు మూడో గురువని అన్నారు.అందుకే పెద్దలు మాతృదేవో భవ..పితృదేవో భవ..ఆచార్య దేవోభవ అన్నార న్నారు.గురువు లేనిదే విద్య లేద అని,విద్య లేనిదే జ్ఞానం లేదని,జ్ఞానం లేకపోతే ఈ లోకం మనుగడే ఉండదు అన్నారు.అందుకే గురువే ఈ ప్రపం చానికి అధిపతని,గురువే మనకు ప్రత్యక్ష దైవమ న్నారు.ప్రతి విద్యార్థి భవిషత్తులో ఎంత సాధించిన, మొదటి మూలం అయిన గురువులని సత్కరించు కోవడం మన అందరి భాధ్యత అని అన్నారు.



అనంతరంకళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథమ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠాలుచెప్పడమేకాకుండాజ్ఞానం,విలువలు జీవిత నైపుణ్యాలను అందించే మార్గదర్శకులుగా మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి కో–ఆర్డి నేటర్‌రాజేష్,అధ్యాపకులువిద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకులు సుకుమార్ బాబు సేవల స్ఫూర్తిదాయకం

– పద్మసుగుణ మెమోరియల్ ట్రస్ట్ వారిచే ఘనసన్మానం



**మదనపల్లె రూరల్,మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కులు,విశ్రాంతడిఎస్పిసుకుమార్‌బాబుసేవలుస్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.శుక్రవారంపుంగనూరుపట్టణంలోజరిగినపద్మసుగుణ మెమోరి యల్ ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు.ఇందులోభాగంగాట్రస్ట్‌వారుశాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తూ సుకుమార్ బాబు సమాజసేవలో తనదైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.ముఖ్యంగా ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నారన్నారు.గట్టి మేలు తలపెట్టవోయ్,తోటివారికి సాయపడవోయ్ అనే సూక్తిని ఆదర్శంగా తీసుకుని సుకుమార్ బాబు సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తున్నారని ప్రశంసించారు.భవిష్యత్తులో ఆయన సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృపాకర్,చర్చి పాదర్,డాక్టర్ నాగే నాయక్,అయుబ్ ఖాన్, నరసింహులు,బాబు,భరత్,భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# 9వ తేదీన జిల్లా కేంద్రంలో జరగబోయే రైతుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**సుండుపల్లె మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సుండుపల్లె మండల అధ్యక్షులు ఎం.రామస్వామి రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడుఆరం రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఫల్యం.రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. రైతులకు సకాలంలో అందించాల్సిన యూరియా సరఫరా చేయడంలో విఫలమైందని విమర్శించినారు. ఈనెల 9వ తేదీన అన్నమయ్య జిల్లాకలెక్టర్‌ఆఫీస్‌నందువైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఇస్మాయిల్, రాష్ట్ర టీఎస్ అధ్యక్షులు బెల్లం సంజీవరెడ్డి, బూత్ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి రెహ్మాన్ ఖాన్, ఉప సర్పంచ్ రఫీక్.ఎంపీటీసీ నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి , శివారెడ్డి ,నాగార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పి-4 విధానంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షే

– స్వలాభం కోసమే కూటమి ప్రభుత్వం పి–4 విధానానికి శ్రీకారం – సంపద సృష్టించి వైద్యకళాశాలలను ప్రభుత్వమే నడపాలి – బీయస్పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ డిమాండ్

**మదనపల్లె టౌన్,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటు పరం చేయడమంటే వైద్య విద్య,ఉచిత వైద్యాన్ని పేదలకు దూరం చేయడమేనని బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆరోపించారు.శుక్రవారం మదనపల్లి పట్టణంలో బిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలను అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు.కోట్ల రూపాయలు అర్జించడం కోసమే ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలలు అప్పగిస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు.సంపద సృష్టించి మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని లేని పక్షంలో రాజీనామా చేయాలని కోరారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కు రాజకీయ బిక్ష పెట్టిన మదనపల్లికి న్యాయం చేయకుంటే ప్రజల దృష్టిలో ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు.మదనపల్లి మెడికల్ కళాశాల విషయంలో ప్రజా సంఘాలు,ప్రతిపక్ష పార్టీల ఆందోళన చేసిన సమయంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు.ప్రయివేటు కు మెడికల్ కళాశాల అప్పగించే ప్రసక్తే లేదని అలా జరగని పక్షంలో రాజీనామా చేస్తానన్న విషయాన్ని గుర్తు చేస్తూ, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఎన్నికల సమయం లో నారా చంద్రబాబు, నారా లోకేష్ లు ప్రజా సంక్షేమం, శ్రేయస్సు కోసం కుటమి ప్రభుత్వం కట్టు బడి ఉందని కళ్ళబోల్లి మాటలు చెప్పి, అధికారం లోకి రాగానే, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ లకు పేదలకు మెడిసిన్ చేయ



కుండా, వైద్య సేవలకు దూరం చేయడం లో భాగంగానే పిపిపి పద్ధతిని తీసుకొస్తోందన్నారు. ఇదే జరిగితే ప్రజలకు ప్రశ్నించే అవకాశాలు ఉండవని,ప్రజల సొమ్ముతో, ప్రభుత్వ భూములతో కోట్ల రూపాయలు దండుకొనే కుట్రలు దాగి ఉన్నాయన్నారు.మదనపల్లి మెడికల్ కళా శాల కోసం గత ప్రభుత్వంలో ప్రతిపక్షంలో వున్నప్పుడు టిడిపి పోరాడి నేడు అధికారం లోకి రాగానే విస్మరించడం తగదని హితవు పలికారు.నేడు అత్యవసర వైద్య సేవలు పొందాలంటే మదనపల్లి నుండి తిరుపతి, బెంగుళూరు, వేలూరు,చెన్నైకు వెళ్ళాలి ఉందని,ఈ నేపథ్యంలో మెడికల్ కళాశాల మదనపల్లికి మంజూరు కావడంపై ప్రజలు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ఆశిస్తే, అందనిద్రాక్షగామార్చివేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికి ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో మందుల కొరత,ఓపిడి సేవలు,వైద్యులు లేక పేదలు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలోప్రభుత్వనిర్ణయం సమం జసంకాదని దీనిపై పునరాలోచించి ప్రైవేటుకు అప్పగించే నిర్ణయాన్నివెనక్కి తీసుకోవాలనిడిమాండ్ చేశారు. లేని పక్షంలోఅందరిని కలుపుకొనిప్రజాఉద్యమాలకు పూను కొంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయ కులు బాలాజీ,సహదేవ,చంద్ర,మహేష్, ప్రశాంత్,నీలు,దంపేట్ల శివ,రెడ్డెప్ప,మొపూరి రెడ్డెప్ప,వేణులు పాల్గొన్నారు.

# మంచి పౌరుల్ని తయారు చేసే కర్మాగారాలే ఉపాధ్యాయులు

– జి. చక్రధర్ రాజు, బి. నాగ తిరుమల రావు



**పుల్లంపేట,మేజర్‌న్యూస్** : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు జి. చక్రధర్ రాజు, బి. నాగ తిరుమల రావు హాజరయ్యారు. కార్యక్రమం ఆరంభంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. ఈసందర్భంగావిద్యాధికారులు మాట్లాడుతూ డాక్టర్ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో విశేష కీర్తి పొందిన మహనీయులు మాత్రమే కాకుండా రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన అరుదైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన పుట్టినరోజునే ఉపాధ్యాయ దినోత్సవంగా దేశం జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థు లను సజ్జన పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యా యుల చేతుల్లోనే ఉందని, అందువల్ల ప్రభుత్వ పాంశాలలను బలోపేతం చేయడం మన అందరి వృత్తి ధర్మమని పేర్కొన్నారు. విద్యార్థులసంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వి. సిద్దయ్య,జిల్లా నాయకులు బి. నరేంద్రనాథ్, ఆర్థిక కార్యదర్శి ఎం. శివరాం ప్రసాద్, మండల ఉపాధ్యక్షులుమునగపాటిశ్రీను,నాయకులు హరి నాథ్, బాలనరసింహులు,మహిళా నాయకురాలు హైమావతి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరంమండలంలోనివిశ్రాంతఉపాధ్యాయులు, సీనియర్ఉపాధ్యాయులనుఘనంగా సన్మానించారు.



# ఘనంగా వెంకట రాజంపేటలో శ్రీవారి కళ్యాణం



**రాజంపేట రూరల్ మేజర్‌న్యూస్** : రాజంపేట మండల వెంకట రాజంపేట గ్రామంలో శుక్రవారం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి స్వామివారిని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిప్రత్యేకంగాఅలంకరించారు. పండితులు వేదమంత్రాల నడుమ సాంప్రదాయపద్ధతులకళ్యాణతంతునునిర్వహించారు. శ్రీవారి కల్యాణాన్ని చూసేందుకు గ్రామనలుమూలలనుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. స్వామివారి కళ్యాణం భక్తులకు కనులు విందు చేసింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

# చిట్వేలు ఉపాధ్యాయులను వరించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు







చిట్వేల్, మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఆంగ్ల విద్యా బోధకులు పి రాజశేఖర్, జీవశాస్త్ర విద్యా బోధకులు శివ నారాయణ, ఆంగ్ల విద్యా బోధకులు జి. శ్రీకాంతి లు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకోవడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. దుర్గరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూనేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాబోధనలో విశేష కృషి చేస్తూ విద్యార్థులకు చక్కగా బోధన సాగిస్తూ సేవలందించిన ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడం జరుగుతుంది. అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్వేల్ నుంచి విద్యార్థులకు క్రమశిక్షణ విలువలతో కూడిన ఉత్తమ విద్యాబోధన చేస్తున్న పీ.రాజశేఖర్ ,పాఠశాల సహాయకులు-ఆంగ్లము, జి.శ్రీకాంతి, పాఠశాల సహాయకులు-ఆంగ్లము మరియు ఏ.శివ నారాయణ, పాఠశాల సహాయకులు-జీవశాస్త్రము లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, నేడు జిల్లాకేంద్రం అయిన రాయచోటిలోని అజయ్ రెసిడెన్సి నందు ఏర్పాటుచేసిన "గురుపూజోత్సవం కార్యక్రమం"లో ఉన్నతాధికారులు నుంచి అవార్డులు అందుకోవడం జరిగింది. చిట్వేలి మండలం నుంచి ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు కోదండ నాయుడు ఈశ్వరయ్యలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటరమణకు అవార్డు



**ములకలచెరువు, మేజర్‌న్యూస్** : అన్నమయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ములకలచెరువు మండలంలోని సోంపాళ్యం పాఠశాలకు చెందిన ఉమ్మడి వెంకటరమణ అన్నమయ్య జిల్లా కేంద్రంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు ఎన్. వెంకటరమణ , శంకరయ్య, ఆయనను అభినందించారు. ఆయన సేవలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నారు. మండలంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# టీచర్స్ డే సందర్భంగా 30 మంది ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే



**రాజంపేట మేజర్‌న్యూస్**: రాజంపేట పట్టణంలోనిఆకేపాటి భవన్ నందుడా. సర్వేపల్లిరాధాకృష్ణన్‌జయంతి సందర్భంగా టీచర్స్ డే సందర్భంగా 30 మంది ఉపాధ్యాయలను సన్మానించి బహుమతులను అందజేసిన వైఎస్ ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటీ అమర్ నాథ్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్మాణానికి అహర్నిశలు శ్రమిస్తున్న గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు వారితో పాటు రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

## ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన భద్రకాళి



**చిట్వేలి, మేజర్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలంలోని పాత చిట్వేలీలో కోటలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తెల్లవారు జామునుండే అమ్మవారి సేవలు మహిళలు ధరించారు. ఆలయ ప్రధా నార్చకులు అమ్మవారికి పంచా మృతాభిషేకం పుష్పాభిషేకం కుంకుమార్చన విశేష పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికివిచ్చేసిన మహిళలు స్వయంగా అమ్మవారి ఎదుట కుంకుమార్చన నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం మహా మంగళహారతి తీర్థప్రసాదాల వినియోగాన్ని నిర్వహిం చారు. ఆల యానికి విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు ఆలయ నిర్వహకులు ఏర్పాటు చేశారు.

# శ్రీ విద్యారణ్య గురుకులంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కలకడ మేజర్‌న్యూస్ :** స్థానిక కలకడలో ఉండే శ్రీ విద్యారణ్య గురుకులంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. కలకడ సి.ఐ డి.లక్ష్మన్న పొత్తూరి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని విశ్రాంత ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ యొక్క బోధన పద్ధతులను, ఆయన రాజనీతి గురించి, ఆయన బాల్యం గురించి విద్యార్థులకు వివిధ రంగాలలో ఆయన కృషిని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యొక్క ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల చైర్మన్ శ్రీ వీరమనాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పుల్లారెడ్డి , డైరెక్టర్ శివారెడ్డి పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ ఆటో అందజేత

## చమర్తి చేతుల మీదుగా ఈ ఆటో అందజేత



**రాజంపేట,మేజర్ న్యూస్** : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజంపేట పర్యటన సందర్భంగా పెన్షన్ ఇచ్చే సమయంలో నడవలేని ఆ బాధితురాలికి అండగా ఉండేందుకు ఆమె భర్త కోరిక మేరకు శుక్రవారం ఈ ఆటోను రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ మనం ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, ఒక కుటుంబానికి ఆసరాగా ముఖ్యమంత్రి కి తనకి ఆటో అందిస్తే కుటుంబాన్ని పోషించుకుంటానని అడిగిన వెంటనే ఈ ఆటోను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు తన చేతులు మీదుగా అందజేయడం చాలా ఆనందంగా ఉందని, నాయకత్వం అంటే ఒకరిని నిలబెట్టినప్పుడే అది నిజమైన నాయకత్వం అవుతుందని ఆయన తెలియజేశారు.



# ఈనెల 7,8 తేదీలలో చంద్రగ్రహణ నివారణార్థం విశేష పూజలు

– మడికయ్యల శివాలయం ప్రధాన అర్చకులు టి.విశ్వేశ్వర ప్రసాద్

**మదనపల్లె,మేజర్‌న్యూస్** : ఈనెల ఏడవ తేదీ అనగా (ఆదివారం) రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం వేళ మడికయ్యల శివాలయంలో విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు టి.విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ గ్రహణం ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని చెప్పారు.ఇందులో భాగంగా ప్రధానంగా శతభిష నక్షత్రము కుంభరాశి వారికి ఎక్కువ మరియు వృషభ రాశి,మిథున రాశి,సింహ రాశి,కన్యరాశి,తులరాశి,మకర రాశి,,కుంభరాశి, మీనరాశి వారికి కూడా ఈ గ్రహణ దోషం ఉంటుందన్నారు.కావున సోమవారం ఉదయం అనగా 8న గ్రహణ దోష నివారణార్థం ఆలయంలో శ్రీ గణపతి పూజ పుణ్యాహవాచనం,పంచగవ్యప్రాసన,నవగ్రహ శాంతి,పూజ రుద్రాభిషేకం,చంద్రగ్రహణ దోష నివారణార్థం నవగ్రహోమం చంద్రగ్రహణ హోమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. కావున పై కనబరిచిన రాశుల వారందరూ కూడా యొక్క పూజలో పాల్గొని స్వామివారి అనుగ్రహంతో యొక్క గ్రహణ దోష నివారణ తొలగించుకొని సూచనలు చేశారు. స్వామివారి అనుగ్రహంపొందితీర్థ,ప్రసాదము లో స్వీకరించవలసిందిగా కోరారు.అలాగే ఈయొక్క పూజ లోపాల్గొనేవారుఆదివారం ఉదయం 11 లోపల దేవాలయము నందు సంప్రదించాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9440133664 అనేమొబైల్‌నెంబరును సంప్రదించవచ్చునన్నారు.



# థిల్లానా ది మెగా ఫెస్ట్ ఆఫ్ టాలెంట్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

– హాజరైన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్** : మదనపల్లె పట్టణంలో జరుగబోవు థిల్లానా ది మెగా ఫెస్ట్ ఆఫ్ టాలెంట్ పోటీల పోస్టర్లనుశుక్రవారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా దిగ్విజయంగా జరుగుతున్న థిల్లానా సాంస్కృతిక పోటీలను ఈ సంవత్సరం సెప్టెంబర్ 13న స్థానిక శ్రీ చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపం నందు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.ఈ కార్యక్రమానికి మదనపల్లె మరియు చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలు విజయవంతం చేయాలని తెలిపారు.థిల్లన నిర్వాకుడు డాన్స్ మాస్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ఇందులో డాన్స్ సింగింగ్ ఫైటింగ్ మెహందీ షార్ట్ ఫిలిం విభాగాలలో పోటీలు ఉంటాయని,విజేతలకు మొదటి ద్వితీయ మరియు తృతీయ బహుమ తులతో పాటు ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ మరియు మెడల్ ఇవ్వడం జరుగుతుందని,ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరుకున్నారు. పాల్గొన దలచిన వారు 10వ తేదీ లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు.మరిన్ని వివరాలకు 9676499064 నెంబరును సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, థిల్లానా సభ్యులు దిలీప్ మిట్టా,పునీత్ కుమార్,అంజి,మనోజ్ పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణ ఆదర్శప్రాయుడు

సర్వేపల్లి రాధాకృష్ణన్ ఘన నివాళులు అర్పించిన చమర్తి



**రాజంపేట,మేజర్ న్యూస్:** సర్వేపల్లి రాధాకృష్ణ ఆదర్శప్రాయాలని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు నడిచి ఎంతోమందికి భవిష్యత్తును చూపిస్తూ ఆదర్శంగా నిలవాలని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజంపేట టిడిపి కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత మనకి అంతటి స్థాయి గౌరవం ఇవ్వవలసిన వ్యక్తి గురువని, అలాంటి గురువులందరికి ఆదర్శప్రాయుడు సర్వేపల్లి రాధాకృష్ణ గారని, అందుకే ప్రతి గురువు ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన తెలియజేశారు.